క్లుప్తంగా

రామాలయం నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న వెంకటేశ్వరరావు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు సిద్దేశ్వరంలో నిర్మిస్తున్న రామాలయానికి స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి ఐ.వెంకటేశ్వరరావు 10 వేల116 రూపాయలు విరాళంగా ఇచ్చారు. గ్రామస్తుడు పూతి పోలయ్యరెడ్డికి శుక్రవారం నగదు అందజేశారు.

మంచినీటి బోరుకు ఏర్పాట్లు



భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. అంబేడ్కర్ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేయనున్న మంచినీటి బోరు పనులకు శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ ప్రాంతంలోని ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారని తెలియడంతో వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో కరజాడ కృష్ణ, ఎం. అప్పలనాయుడు, పి.ప్రభాకర్, భారతి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బీమా సాయం అందిస్తున్న కార్పొరేటర్ మూర్తి

గాజువాక : జీవీఎంసీ 65వ వార్డు సంజీవగిరి కాలనీకి చెందిన కొత్తపు అమ్మాజీ కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా నగదును ఆ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహ పాత్రుడు (కేబుల్ మూర్తి) శుక్రవారం అందజేశారు. అమ్మాజీ ఇటీవల మృతి చెందడంతో వైఎస్సార్ బీమా రూ.1 లక్ష మంజూరు కాగా, తక్షణ సాయం కింద రూ.10వేలను ఆమె కుమారుడు గురవయ్యకు అందజేశారు. మిగిలిన మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జె.సతీష్, కె.కె.మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనంతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు. అర్చకులు చక్రవర్తి, శ్రీకాంత్ నిత్యకల్యాణం నిర్వహించారు.

నేడు బీజేపీ సమావేశం

గాజువాక : గాజువాకలో శనివారం నిర్వహించనున్న బీజేపీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని పార్టీ బూత్ అధ్యక్షులు, శక్తికేంద్ర ప్రముఖులు జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర కోరారు. చినగంట్యాడ జంక్షన్‌లోని ఫంక్షన్ హాల్లో సభా ప్రాంగణాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్రస్థాయి నాయకులు హాజరు కానున్నారని తెలిపారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు.

చెరువులకు మహర్దశ

- రూ.2 కోట్లతో కృష్ణమహంతి చెరువు అభివృద్ధి
- రూ.1.5 కోట్లతో నక్కల చెరువు సుందరీకరణ



అభివృద్ధి చేయనున్న అక్కిరెడ్డిపాలెం నక్కల చెరువు



కృష్ణమహంతి చెరువులో జరుగుతున్న పూడికతీత పనులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68, 69 వార్డుల్లోని చెరువులకు మహర్దశ పట్టనుంది. అభివృద్ధి పనుల్లో భాగంగా పలుచోట్ల చెరువుల సుందరీకరణ చేపట్టనున్నారు. మింది, అక్కిరెడ్డిపాలెం, కృష్ణమహంతి చెరువులను అమృత్–2లో భాగంగా గ్రీన్ బోర్డు కార్పొరేషన్ ద్వారా సుందరీకరించనున్నారు.

జీవీఎంసీ 68వ వార్డులో 16 ఎకరాల మింది చెరువు, అక్కిరెడ్డిపాలెంలోని 2 ఎకరాల నక్కల చెరువులను గ్రీన్ బోర్డు డెవలప్ మెంట్ ద్వారా సుందరీకరించనున్నారు. రూ.1.50 కోట్లు నిధులతో అక్కిరెడ్డిపాలెంలోని నక్కల చెరువులో పూడికతీత పనులు, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, ట్రాక్ పక్కన విద్యుత్ లైట్లు, గట్టు పక్కన మొక్కలు నాటడం వంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మింది చెరువు అభివృద్ధికి నిధుల మంజూరు ఇంకా కొలిక్కి రాలేదని కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ తెలిపారు.

- 69వ వార్డు నాతయ్యపాలెంలో 17.50 ఎకరాల కృష్ణమహంతి చెరువును రూ.2 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. పనులు ఇప్పటికే ప్రారంభమైనట్లు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి తెలిపారు. చెరువుల్లో పూడికతీత పనులు, చెరువు గట్టు చుట్టూ రాళ్లతో బౌండరీ, ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్, చెరువు చుట్టూ విద్యుత్ లైట్లు, మొక్కల పెంపకం వంటి పనులు చేపట్టనున్నారు.

కొనసాగుతున్న గంగవరం పోర్టు కార్మికుల దీక్షలు



దీక్ష శిబిరంలో కూర్చున్న గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక దీక్షలు శుక్రవారానికి 25వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. యాజమాన్యం దిగి వచ్చి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొవిరి అప్పలరాజు, వాసుపల్లి ఎల్లాజీ, నొల్లి స్వామి, పేర్ల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి ఆస్పత్రికి నెబ్యులైజర్ల అందజేత



ఆస్పత్రికి నెబ్యులైజర్లను అందిస్తున్న రమణారెడ్డి

అగనంపూడి: అగనంపూడి ఆస్పత్రికి పీబీఆర్ చారిటబుల్ ట్రస్ట్ కంప్రెసర్ నెబ్యులైజర్లను అందజేసింది. ట్రస్ట్ చైర్మన్ పులి వెంకట రమణారెడ్డి రూ.20వేల విలువైన నెబ్యులైజర్లను చిన్నపిల్లల వైద్యుడు పి.గోపాలకృష్ణకు అందజేశారు. రమణారెడ్డి మాట్లాడుతూ తన తండ్రి పులి భూలోకరెడ్డి జ్ఞాపకార్థం ట్రస్ట్ స్థాపించి, రెండేళ్లుగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అగనంపూడి నాయకులు నెల్లి శ్రీనివాసరావు, బలిరెడ్డి సత్యనారాయణ, కిడిమి హనుమంతురావు, గుదే సుశీలా గజేంద్రరావు, బంధం అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోల దృష్టికి ప్రైవేటు పాఠశాలల సమస్యలు



గాజువాక ఎంఈవోలతో జిప్సా ప్రతినిధులు

గాజువాక : బడ్జెట్ ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) ప్రతినిధులు గాజువాక, పెదగంట్యాడ మండలాల విద్యాశాఖాధికారులకు వివరించారు. రెండు మండలాలకు చెందిన విద్యా శాఖాధికారులు సునీత, విశ్వనాథం, రమణాజీ, శ్రీనివాస్‌లను జిప్సా నాయకులు శుక్రవారం కలిసి సమస్యలపై చర్చించారు. పాఠశాలల గుర్తింపు రెన్యువల్స్, పాఠశాలలు అనుసరించాల్సిన వివిధ అంశాలపై చర్చించినట్టు జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు తెలిపారు. కార్యక్రమంలో జిప్సా నాయకులు బి.శ్రీనివాసరావు, డి.శ్రీనివాస్, మురళి, మౌళి, రాము, సత్యనారాయణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ నేడు

గాజువాక : గాజువాక ప్రాంతంలోని ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు శనివారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు గాజువాక ప్రైవేటు పాఠశాలల సంక్షేమ సంఘం (జిప్సా) అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు తెలిపారు. పాతగాజువాకలోని యశోద స్కూల్‌లో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. రెండేళ్లుగా పాఠ్యాంశాల్లో చోటుచేసుకున్న మార్పులపై, నూతన పరీక్షా విధానాలపై శిక్షణ ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విశాఖ స్వచ్ఛతకు చిరునామా కావాలి



దోమల నెట్ అందిస్తున్న కార్పొరేటర్ వరలక్ష్మి

అగనంపూడి: మహా విశాఖ స్వచ్ఛతకు చిరునామాగా మారాలని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి అన్నారు. మంత్రిపాలెం గ్రామంలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమంతో పాటు స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛ విశాఖ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని కోరారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రతీ ఒక్కరు పాల్గొని విశాఖను ప్రథమస్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు, నాయకులు పచ్చికోరు రమణమూర్తి, సేనాపతి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల కృషి వల్లే స్టీల్‌ప్లాంట్ పురోగతి



పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులను సత్కరిస్తున్న అధికారులు, నాయకులు

ఉక్కునగరం: ఉద్యోగుల కృషి వల్లే స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకతల్లో పురోగతి సాధిస్తోందని స్టీల్ ప్లాంట్ ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగాధిపతి ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ అన్నారు. ఉద్యోగులు సీహెచ్. రామరాజు, వై. బాబ్జీ పదవీ విరమణ సందర్భంగా ఇంజినీరింగ్ షాప్స్‌కు చెందిన ఫోర్జ్ షాప్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీనియర్ ఉద్యోగులను ఆదర్శంగా తీసుకోవాలని జూనియర్ ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, విభాగం జీఎంలు పాండే, మిశ్రా, వివిధ కార్మిక సంఘాల నాయకులు గొందేశి అప్పలరెడ్డి, బోసుబాబు, శ్రీనుబాబు, భాస్కర్, కారు రమణ తదితరులు పాల్గొన్నారు.

పోరాట కమిటీ ఆధ్వర్యంలో రేపు పాదయాత్ర

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉక్కునగరం, నిర్వాసిత కాలనీల్లో పాదయాత్ర చేయనున్నారు. దీక్షలు ప్రారంభించి 900 రోజులు పూర్తవుతున్న సందర్భంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం నిర్వహించిన పోరాట కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అగనంపూడి, కూర్మన్నపాలెం, ఉక్కునగరం, గంగవరం ప్రాంతాల్లో ఆ రోజు ఉదయం 7.30 నుంచి 10.30 వరకు పాదయాత్ర జరగనుంది. పాదయాత్రలో ఉద్యోగులు, నిర్వాసితులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొవాలని వారు కోరారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ దీక్షలో పాల్గొంటున్నారని తెలిపారు. అనంతరం పాదయాత్రగా కలెక్టరేట్ వెళ్తున్నందున అందరూ పాల్గొవాలని కోరారు.

31న చలో గంగవరం పోర్టు : గంగవరం పోర్టు యాజమాన్యం స్టీల్‌ప్లాంట్‌కు పెడుతున్న ఇబ్బందులకు నిరసనగా సోమవారం సాయంత్రం 4.30 గంటలకు సెంట్రల్ స్టోర్స్ జంక్షన్ నుంచి చలో గంగవరం పోర్టు పాదయాత్ర నిర్వహించనున్నామన్నారు. పోరాట కమిటీ పిలుపు మేరకు అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులు కోరారు.

విశాఖ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికుల అవస్థలు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు వెళ్లే ప్రయాణికులు శుక్రవారం అవస్థలు పడ్డారు. విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్ దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంకు చేరుకునే సమయానికి కోచ్ ఇండికేటర్లు తప్పుగా డిస్‌ప్లే చేయడంతో ప్రయాణికులు ఉరుకులు పరుగులు తీయాల్సి వచ్చింది. డిస్‌ప్లేకు, రైలు ఆగిన చోటుకు మధ్య 5, 6 బోగీల వ్యత్యాసం ఉండడంతో లగేజీలు, పిల్లలు, వృద్ధులతో పరుగులు తీస్తూ రిజర్వ్‌డ్ కోచ్‌లను చేరుకోవాల్సి వచ్చింది. రైలు ఆగే సమయం 2 నిమిషాలే కావడంతో హడావుడి అయింది. దీనిపై ప్రయాణికులు సిబ్బందిని నిలదీశారు. దీంతో వారి మధ్య చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది.

విద్యుత్ శాఖ ఏఈ నూతన కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఈ మహేంద్రనాథ్

కూర్మన్నపాలెం: వీఎస్ఈజెడ్ 33/11కేవీ పరిధిలోని కూర్మన్నపాలెం, శివాజీనగర్, రాజీవ్‌నగర్, రాసాలమ్మ కాలనీ, వీఎస్ఈజెడ్ ఇండస్ట్రియల్ ఏరియాకు చెందిన నూతన విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం శుక్రవారం ప్రారంభమైంది. ఈపీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్ ముఖ్య అతిథిగా హాజరై, కార్యాలయాన్ని ప్రారంభించారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జోన్–2 డీఈ బీ.కె.నాయుడు, ఆటోనగర్ సబ్ డివిజన్ ఈఈ పార్థసారధి, కూర్మన్నపాలెం సెక్షన్ ఈఈ హరికుమార్, ఇతర విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ వితరణ



ఉపాధ్యాయులకు మొక్కలు అందిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెంకు చెందిన వాసవీ క్లబ్ ప్రతినిధులు 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు ప్రధానోపాధ్యాయిని ఎం.ఎల్.ఎస్.కాంతం సమక్షంలో ఉపాధ్యాయులకు మొక్కలను అందజేశారు. విద్యార్థులకు నోట్ బుక్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కటకం శైలజ, ఉద్దగిరి కుమార గుప్తా, నున్న గాంధీ గుప్తా, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణగా ప్రత్యేక చట్టాలు

డీఎస్ఎన్ఎల్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీసుధ



లా వర్సిటీలో మానవహారంగా ఏర్పడిన న్యాయ విద్యార్థులు

సబ్బవరం: మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని.. వాటిపై అవగాహన కలిగి ఉండాలని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీసుధ అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా ఆధ్వర్యంలో వర్సిటీ ప్రాంగణంలో శుక్రవారం మానవ హారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి పేరుతో,ప్రేమ పేరుతో ఎన్నో రకాలుగా అమ్మాయిలు అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. ఈ అక్రమ రవాణా నుంచి బాధితులను రక్షించడానికి అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయ వుమెన్ అండ్ చైల్డ్ లా డైరెక్టర్ ఆచార్య విజయలక్ష్మి పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించినట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. లలితా జ్యూవెల్లరీ మార్ట్, కల్యాణ్ జ్యూవెల్లర్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, స్పందన స్ఫూర్తి, ఫైనాన్సియల్, హానర్ ల్యాబ్స్, హెటిరో డ్రగ్స్, యాక్సిస్ బ్యాంక్, టీమ్ లీజ్, ఎస్‌బీఐ అండ్ ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్, పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 535 ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 415 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 161 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వారి సర్టిఫికెట్లను పరిశీలించి, అభ్యర్థులకు సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో వాటిల్లో నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తోందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎ.సంగీత, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

‘స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తే సహించం’



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, అన్నింటినీ ఎదుర్కొంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 897వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు, కార్మికులు వచ్చే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. ఎందరో కార్మికుల బలిదానాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. వెంటనే విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందనే ప్రకటనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

31న భారీ నిరసన : ఉక్కు దీక్షలు చేపట్టి 900 రోజులు గడుస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 31న దీక్ష శిబిరం వద్ద చేపట్టనున్న భారీ నిరసన కార్యక్రమంలో నిర్వాసితులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల విధుల బహిష్కరణ

- కనీస వేతనాల కోసం వడ్లపూడి వేగన్ రిపేర్ వర్క్ షాప్ ఎదుట ఆందోళన



వడ్లపూడి వేగన్ రిపేర్ వర్క్‌షాప్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

అక్కిరెడ్డిపాలెం: ప్రస్తుతం చెల్లిస్తున్న కనీస వేతనాలైనా సక్రమంగా చెల్లించాలని కోరుతూ ఆటోనగర్ ఎఫ్–బ్లాక్, చుక్కవానిపాలెం రైల్వే గేటు వద్ద గల వడ్లపూడి వేగన్ రిపేర్ వర్క్‌షాప్ (రైల్వే స్పేర్‌పార్ట్స్ రిపేర్ కంపెనీ) కార్మికులు షాప్ ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్మికులు శుక్రవారం విధులను బహిష్కరించారు. ఆందోళనలో పాల్గొన్న రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.నరసింహ మాట్లాడుతూ వడ్లపూడి రైల్వే స్పేర్‌పార్ట్స్ కార్మికులు రోజుకు 12 గంటలు పని చేస్తున్నారని, కాని ప్రభుత్వాలు అమలు చేసిన వేతనాలు చెల్లించడం లేదని దుయ్యబట్టారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, భద్రతా నియమాలు అమలు చేయడం లేదన్నారు. రైల్వే స్పేర్‌పార్ట్స్ కంపెనీ కాలర్ కార్మికుల ప్రధాన కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై యాజమాన్యానికి ఎన్నిమార్లు వినతిపత్రాలు అందజేసినా పరిష్కారం కావడం లేదన్నారు. వర్క్‌షాప్‌లో కంపెనీ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి 15 రోజుల్లోగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా దువ్వాడ పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. కార్యక్రమంలో సిటూ గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి ఎ.లోకేష్, గాజువాక జోన్ అధ్యక్షుడు డి.రమణ, వర్క్‌షాప్ యూనియన్ నాయకులు ఎ.అవతారం, రాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘విజ్ఞాన్’లో రక్తదాన శిబిరం



మహిళా కళాశాలలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న అధ్యాపకులు

అగనంపూడి: విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల, మహిళా ఇంజినీరింగ్ కళాశాలల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సుమారు వెయ్యిమంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏఎస్ రాజా, ఎన్‌టీఆర్ బ్లడ్ బ్యాంకులు, రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దువ్వాడలోని ఫార్మా కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో 250మందికి సేవలు అందించారు. కార్యక్రమాల్లో సీఈవో శ్రీకాంత్, రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్స్ జె.సుధాకర్, బి.అరుంధతి, వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, డీన్లు బి.సతీష్, దుర్గా శ్యామ్‌ప్రసాద్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్లు, సుందర్ రామమ్, సుహాసిని, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.